# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 20- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 77 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# బ్యాంకులు రైతుల వద్దకే వెళ్లాలి



- భట్టి విక్రమార్క కీలక సూచనలు
- వ్యవసాయ రుణాలే అభివృద్ధికి పునాది
- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు బ్యాంకుల భాగస్వామ్యం
- 2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్ ప్రతిపాదన

హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములుగా మారాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యయంతో మాత్రమే ఈ లక్ష్యం సాధ్యం కాదని, భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, విస్తృత ఆర్థిక మార్కెట్లు, వినూత్న ఆర్థిక వనరుల సమీకరణ అవసరమని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రైజింగ్-2047 కేవలం విజన్ పత్రం కాదని, తెలంగాణ ప్రజలతో కుదుర్చుకున్న అభివృద్ధి ఒప్పందమని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలంటే బ్యాంకింగ్ రంగం కూడా సమాంతరంగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉందని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు తమ వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు.

మిగతా 2లో



# కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

**ఖర్గే అధ్యక్షతన కీలక సమావేశం**
**హాజరైన సోనియా, రాహుల్, ప్రియాంక**
**కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంల పాల్గొనిక**
**పార్టీ భవిష్యత్ వ్యూహాలపై చర్చ**

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీకి సంబంధించిన కీలక అంశాలు, భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు, పార్టీ కీలక నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు

మిగతా 2లో


# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం

- పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు
- ఖమ్మంలో పీఏసీ సమావేశం
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు
- పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి



ఖమ్మం, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తూ కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో



# కేబీఆర్ వన్‌వేతో ట్రాఫిక్ తిప్పలు

- కొత్త ట్రాఫిక్ విధానంతో వాహనదారుల ఇబ్బందులు
- జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో భారీ రద్దీ
- ప్రయాణ సమయం మూడు రెట్లు పెరిగిన పరిస్థితి
- కొద్ది రోజుల్లో పరిస్థితి మెరుగవుతుందని పోలీసులు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో అమలు చేసిన కొత్త వన్‌వే ట్రాఫిక్ విధానం మొదటి రోజే వాహనదారులకు చుక్కలు చూపించింది.

మిగతా 7లో

## ఆయుష్ విద్యార్థుల పోరాటానికి

# బీజేపీ మద్దతు

- ఎర్రగడ్డ ఆసుపత్రిలో విద్యార్థులతో రామ్‌చందర్‌రావు భేటీ
- స్టైపెండ్ అసమానతలపై ఆందోళన వ్యక్తం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలు
- న్యాయమైన డిమాండ్లకు అండగా ఉంటామన్న హామీ





హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): ఎర్రగడ్డలోని ఆయుర్వేద ఆసుపత్రిలో స్టైపెండ్ పెంపు కోసం ఆందోళన చేస్తున్న ఆయుష్ విద్యార్థులను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు బుధవారం కలిసి వారికి సంఘీభావం తెలిపారు.

మిగతా 2లో

## ప్రజల వద్దకే ప్రభుత్వం..

# గ్రామాభివృద్ధే ధ్యేయం

- ప్రజా సమస్యల స్వీకరణ
- సంక్షేమ పథకాల వివరాలు
- రైతులు, మహిళలకు ప్రోత్సాహం
- జలసిరి, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి
- మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లస్మన్నపల్లి గ్రామంలో

మిగతా 2లో

# 22ఏ భూములపై బీఆర్ఎస్ ఆగ్రహం

- బాధితులతో హరీశ్ రావు భేటీ
- న్యాయ సహాయానికి లీగల్ సెల్
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- సమస్య పరిష్కారానికి పోరాట హెచ్చరిక



హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు): 22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులతో తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాధితుల ఆవేదనలను ఓపికగా విన్న హరీశ్ రావు వారికి పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బ్యాంకులు రైతుల వద్దకే వెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)



వ్యవసాయం, గ్రామీణ రంగాలే తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, రైతులకు అవసరమైన సమయంలోనే రుణాలు అందాలని అన్నారు. అర్హులైన రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని స్పష్టం చేశారు. పాడి పరిశ్రమ, మత్స్యరంగం, ఉద్యానవనం, ఆయిల్‌పామ్, ఆహార ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాలను కూడా అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని సూచించారు. రైతులకు రుణాలు ఇవ్వడమే లక్ష్యం కాకుండా, ఆ రుణాలు అధిక ఆదాయంగా మారేలా చర్యలు ఉండాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం వసూళ్లపైనే దృష్టి పెట్టకుండా, ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని బ్యాంకులకు సూచించారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, పంట అనంతర మౌలిక వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను కూడా రుణ విధానాల్లో భాగం చేయాలని కోరారు. జూన్ 2026 నాటికి రూ.52,337 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసినందుకు బ్యాంకులను అభినందించిన ఆయన, రుణాల సకాల పంపిణీ కూడా అంతే ముఖ్యమని అన్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వ్యాపారవేత్తలకు రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో నిధులు అందడం ముఖ్యమని చెప్పారు. దరఖాస్తు, మంజూరు, విడుదల ప్రక్రియలకు స్పష్టమైన గడువులు ఉండాలని ఆదేశించారు. ప్రస్తుత త్రైమాసికంలో క్రెడిట్ గ్యారంటీ పథకం కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలకు ఆమోదం లభించడాన్ని స్వాగతించిన ఆయన, ఈ పథకం కింద రుణాలు పొందే పారిశ్రామికవేత్తలను తనఖాల పేరుతో ఇబ్బంది పెట్టవద్దని బ్యాంకులకు సూచించారు. తెలంగాణ రైజింగ్-2047లో పేర్కొన్న క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాలవారీగా రుణ వ్యూహాలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. కృత్రిమ మేధస్సు, జీవ విజ్ఞానం, ఔషధ రంగం, విమానయాన, స్టార్టప్‌లకు అధునాతన ఆర్థిక సహాయం అందించాలని, తయారీ, గిడ్డంగులు, మౌలిక సదుపాయాలు, గృహనిర్మాణ రంగాలకు ప్రత్యేక రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, మత్స్యరంగం, పాడి పరిశ్రమలకు చౌకైన, సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా "తెలంగాణ రైజింగ్-2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్" రూపొందించాలని ప్రతిపాదిస్తూ, వ్యవసాయం, మహిళా పారిశ్రామికవేత్తలు, యువత ఉపాధి, హరిత ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఆర్థిక చేర్పు వంటి రంగాల్లో స్పష్టమైన వార్షిక లక్ష్యాలు ఉండాలని భట్టి విక్రమార్క సూచించారు.

# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)




ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ పరిస్థితులు, రాబోయే ఎన్నికల వ్యూహాలపై విస్తృత చర్చ జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ సహ ఇన్‌చార్జి సచిన్ సావంత్, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో భాజపా, బీఆర్ఎస్ కలిసి రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నాయని పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచే దళితులు, గిరిజనులు, మైనారిటీ వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున తొలగింపులకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించడంతో పాటు మరికొన్ని లక్షల ఓటర్లను అనిశ్చితిలో ఉంచి గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని అన్నారు. ఈ పరిణామాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి మార్పును పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పొంగులేటి పేర్కొన్నారు. అయితే ప్రతిపక్షాలు సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం సాగుతోందని విమర్శించారు. అలాంటి ప్రచారాలను పార్టీ శ్రేణులు వాస్తవాలతో తిప్పికొట్టాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత బలమైన స్థానం కల్పించేందుకు తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ఎన్నికల్లో విజయాన్ని సాధించాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం.. గ్రామాభివృద్ధే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

"పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. పలువురు గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని అంశాలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు.

లస్మన్నపల్లి గ్రామంలో మొదటి దశలో ఏడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, రెండో విడతలో మరిన్ని ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని 306 కుటుంబాలు రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల ప్రయోజనాలు పొందుతున్నాయని వెల్లడించారు. 19 మహిళా సంఘాలకు రూ.6.25 లక్షల వడ్డీలేని రుణాలు అందించగా, బ్యాంకు గ్యారంటీ కింద రూ.2.27 కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. గ్రామంలోని 249 మంది రైతులకు రూ.1.12 కోట్ల రైతు భరోసా నిధులు అందించామని, రైతు రుణమాఫీ కింద రూ.3.63 కోట్ల మేర ప్రయోజనం కల్పించినట్లు తెలిపారు. అలాగే 173 మంది రైతులకు రూ.35 లక్షల సన్న వడ్ల బోనస్ అందుతున్నట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.

జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఏడు రకాల సామాజిక భద్రతా పెన్షన్ల కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలియజేస్తూ అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అదనపు ఆదాయం, దీర్ఘకాలిక లాభాలు అందేలా ప్రతి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# 22ఏ భూములపై బీఆర్ఎస్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)




ఈ సమస్యతో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం న్యాయపరంగా, రాజకీయంగా అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో పది మంది న్యాయవాదులతో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ లీగల్ సెల్ ద్వారా ప్రతి కేసును పరిశీలించి అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలుగా తాము కూడా సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు ఎవరూ మధ్యవర్తులకు కమీషన్లు చెల్లించవద్దని, తక్కువ ధరలకు ఆస్తులు విక్రయించుకోవద్దని సూచించారు. హూడా, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన లేఅవుట్లలో దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన భూములు, ఇళ్లను కూడా 22ఏ జాబితాలో చేర్చడం వెనుక పెద్ద అవకతవకలు ఉన్నాయని హరీశ్ రావు ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఈ విషయంపై మంత్రులు, అధికారులు చేసిన వ్యాఖ్యలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చిన అంశంపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

లక్షలాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసిన ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. చిన్న చిన్న అంశాలపై విచారణలు చేపట్టే ప్రభుత్వం ఈ వ్యవహారంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పును ప్రభుత్వం స్వయంగా సరిదిద్దుకుని ఆన్‌లైన్ రికార్డుల నుంచి 22ఏ ఆంక్షలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హరీశ్ రావు హెచ్చరించారు. అవసరమైతే ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి కూడా సిద్ధమవుతామని పేర్కొన్నారు. అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములన్నింటినీ పునరుద్ధరించాలని, ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ బలోపేతం, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలపై నాయకత్వం అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు ప్రజలకు మరింత చేరువయ్యే విధానాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు సమాచారం. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పాత్రను మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై ఉద్యమాలను విస్తరించడం, సంస్థాగతంగా పార్టీని బలపర్చడం వంటి అంశాలు సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలను నాయకత్వం ముందుంచారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజాపాలన విధానాల గురించి కూడా రేవంత్ రెడ్డి సమావేశంలో ప్రస్తావించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రాల్లో పార్టీ ప్రభుత్వాల పనితీరును ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాల్సిన అవసరాన్ని నాయకులు నొక్కి చెప్పినట్లు సమాచారం. సమావేశం అనంతరం రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమ వేదికలో స్పందిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నట్లు వెల్లడించారు. మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వర్కింగ్ కమిటీ సభ్యులు హాజరైనట్లు పేర్కొన్నారు.




# ఆయుష్ విద్యార్థుల పోరాటానికి బీజేపీ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

గత అనేక రోజులుగా కొనసాగుతున్న ఈ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల సమస్యలను ఆయన నేరుగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని పేర్కొంటూ వారి పోరాటానికి భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దాదాపు పదేళ్లకు పైగా గణనీయమైన పెంపు లేకుండానే కొనసాగుతోందని రామ్‌చందర్‌రావు అన్నారు. జీవన వ్యయాలు పెరిగినా, వైద్య విద్యలో ఖర్చులు అధికమైనా విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

అల్లోపతి విభాగంలోని విద్యార్థులతో పోలిస్తే ఆయుష్ విద్యార్థులకు అందుతున్న స్టైపెండ్ చాలా తక్కువగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వైద్య సేవా రంగంలో పనిచేసే విద్యార్థుల మధ్య ఇంతటి వ్యత్యాసం ఉండటం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ వైద్యులకు దాదాపు అల్లోపతి విద్యార్థులతో సమాన స్థాయిలో స్టైపెండ్ అందుతోందని, తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయుష్ విద్యార్థుల సమస్యలు కొత్తవి కావని, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వాటిని పరిష్కరించడంలో విఫలమైందని రామ్‌చందర్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆందోళనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పదహారు రోజులుగా విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

వైద్య విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని ఆయన సూచించారు. రాష్ట్ర ఆరోగ్య రంగానికి సేవలందించే భవిష్యత్ వైద్యులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు స్టైపెండ్ పెంపుతో పాటు బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన చేస్తున్న ఆయుష్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ వారి వెంటే ఉంటుందని రామ్‌చందర్‌రావు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన ప్రతి వేదికపై వారి తరఫున పోరాడతామని చెప్పారు. ఆయుష్ వైద్య విద్యకు తగిన గౌరవం, ప్రోత్సాహం లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని మరోసారి కోరారు.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- **సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్**

**ఎల్కతుర్తి, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా బైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉచిత రేషన్ బియ్యం, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తదితర పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. శక్తి కేంద్రాలను క్రియాశీలం చేసి ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ఎల్కతుర్తి మండలంలో బీజేపీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ప్రతి బూత్‌లో కమిటీలను క్రియాశీలం చేసి గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై అవసరమైన సందర్భాల్లో పోరాటాలు చేపట్టి ప్రజల పక్షాన బీజేపీ నిలబడాలని అన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేష్, మండల ప్రభారి లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పృథ్వీరాజ్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, వివిధ మోర్చాల నాయకులు, మండల పదాధికారులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

- **మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ**



**హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీలకు రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా సంఘాలు, రాజకీయ ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల డిక్లరేషన్ సభలో దళితులకు రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

దళితులకు రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం అందించే వరకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 21న నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి రాజకీయ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని మైస ఉపేందర్ మాదిగ కోరారు.

## చిన్నజీయర్ స్వామివారి 70వ తిరునక్షత్రం మహోత్సవం



**పెద్దమందడి,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి 70వ తిరునక్షత్రం మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామివారి సూచన మేరకు పెద్దమందడి మండలం వీటీ రిజిస్ట్రేషన్ నంబర్-3 ఆధ్వర్యంలో బుధవారం వెల్టూర్ గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామివారి 70వ తిరునక్షత్రం మహోత్సవ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. గ్రామంలోనిర్వహించిన శోభాయాత్రలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారి మహోత్సవం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు చిన్నజీయర్ స్వామివారి ఆధ్యాత్మిక సేవలు, మహోత్సవ ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో వీటీ సభ్యులు జి. వెంకట రామారెడ్డి, ప్రజ్ఞా వికాస్ కొత్త రాములు, రేవతమ్మ, జయమ్మ, అశ్విని, రాధ, బలరాము, చీఫ్ కోఆర్డినేటర్ వి. కురుమూర్తి, వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్, సెక్రెటరీ వెంకటస్వామి, ఎస్. రమేష్, జగదీష్ రెడ్డి, సురేష్, మహేష్, రాము, కె. శివాజీ, శివ, రాజశేఖర్, కాశన్న, వెంకటయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.





## సర్పంచులు ఉన్నా.. అభివృద్ధి మాత్రం శూన్యం!

- **గుంతలమయంగా రోడ్లు.. మురుగునీటితో అవస్థలు.. గ్రామాల్లో మౌలిక వసతుల కొరత**

**ఎల్కతుర్తి, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):**ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మౌలిక వసతులు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలకు సర్పంచులు ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సరైన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజల కష్టాలు మరింత పెరుగుతున్నాయి.

### చినుకు పడితే చాలు.. బురదమయం

మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందికరంగా మారిందని ప్రజలు చెబుతున్నారు.

### డ్రైనేజీ లేక రోడ్లపై మురుగునీరు

పలు గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల బెడద పెరుగుతోంది. రోడ్ల పక్కన గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో పారిశుధ్య పరిస్థితులు మరింత అధ్వానంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అభివృద్ధి ఎక్కడంటున్న ప్రజలు

ఒకప్పుడు ఉత్తమ గ్రామాలుగా గుర్తింపు పొందిన తమ గ్రామాలు నేడు కనీస సౌకర్యాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని గ్రామస్తులు అంటున్నారు. గతంలో సర్పంచులు లేని సమయంలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే ప్రస్తుతం సర్పంచులు ఉన్నప్పటికీ గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని వారు విమర్శిస్తున్నారు.

### అధికారులు స్పందించాలంటూ డిమాండ్

గ్రామాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్లు, డ్రైనేజీల సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని కోరుతున్నారు. గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టి, మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని, లేకపోతే ప్రజల ఇబ్బందులు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## చెన్నమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం

**పెద్దమందడి,ఆగస్టు19(తెలంగాణ ముచ్చట్లు):**పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన కేశపాగ భాగ్యమ్మ, రాములు దంపతుల కుమార్తె కేశపాగ చెన్నమ్మ గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న రాజశేఖర్ శెట్టి, పి. రవీందర్, గుపాని వెంకటేష్, కొమ్ము చెన్నయ్య మాదిగ, కొమ్ము చెన్నకేశవులు మాదిగ తదితరులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో కొమ్ము తిరుపతయ్య మాదిగ, కొమ్ము సాయిలు మాదిగ, కొమ్ము వెంకటయ్య తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ఫొటోగ్రాఫర్ల సేవా స్ఫూర్తికి ప్రతీకగా అన్నదాన కార్యక్రమం





**జమ్మికుంట టౌన్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం బొమ్మల గుడిలో బుధవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జమ్మికుంట మండలానికి చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా చిన్నింటి నాగేంద్ర మాట్లాడుతూ.. ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ముఖ్యమైన ఘట్టాన్ని చిత్రరూపంలో భద్రపరిచే గొప్ప కళ అని అన్నారు. సమాజానికి నిత్యం తమ సేవలను అందిస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటామని, ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించడం ద్వారా సేవా భావాన్ని చాటుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన అసోసియేషన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేంద్రతో పాటు రచ్చ గణేష్, బీకే వెంకన్న, విజయగిరి రాంబాబు, బిట్ల తిరుపతి, గండి రంజిత్ కుమార్, కొక్కుల శ్రీరాములు, కోటగిరి కుమార్, పంజాల గణేష్, భాస్కర్, సత్యం, పొనగంటి రాజు, పవన్ బండి, కృష్ణ, శివసాయి, అంబాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుకు చేయూత నిరుపేద విద్యార్థులకు అండగా అంబాల ప్రభాకర్

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ మానవతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి బీఎస్పీ నాయకులు డాక్టర్ అంబాల ప్రభాకర్ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో గల గార్డియన్ పాఠశాలలో బుధవారం ముగ్గురు నిరుపేద విద్యార్థులకు సుమారు రూ.10 వేల విలువైన పుస్తకాలను తన సొంత సహాయంతో పాటు దాతల సహకారంతో అందజేశారు.



ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ అంబాల ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో గొప్ప వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, రాజకీయ నాయకులుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత సమాజానికి సేవ చేయాలనే భావనను అలవర్చుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాలను ఆదర్శంగా తీసుకుని సమాజానికి తిరిగి సేవ చేయాలనే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రానున్న దసరా పండుగ సందర్భంగా పాఠశాలలోని పిల్లలందరికీ ఆట వస్తువులు అందజేస్తానని డాక్టర్ అంబాల ప్రభాకర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు మారపల్లి మొగిలయ్య పాఠశాలకు రూ.1,016 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో పెరిగి చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

కార్యక్రమం అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ అంకూస్, ఉపాధ్యాయ బృందం డాక్టర్ అంబాల ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నిరుపేద కుటుంబం కన్నీరు తుడిచిన మున్సిపల్ చైర్మన్





- ఇల్లు లేని కుటుంబానికి గది సౌకర్యం..
- దహన సంస్కార ఖర్చులు భరించిన దిలీప్ కుమార్

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** మానవత్వమే మనిషికి నిజమైన ఆభరణమని చాటుతూ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. జమ్మికుంట పట్టణ పరిధిలో కనీసం ఉండేందుకు ఇల్లు కూడా లేని నిరుపేద సంద లింగయ్య అకాల మరణంతో వారి కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో ఉండగా, చైర్మన్ దిలీప్ కుమార్ మానవతా హృదయంతో ముందుకొచ్చారు.

సంద లింగయ్య అంత్యక్రియల్లో స్వయంగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దిలీప్ కుమార్ దహన సంస్కారాలకు అయ్యే ఖర్చులను భరించడంతో పాటు, కుటుంబ సభ్యులు ఉండేందుకు గది సౌకర్యాన్ని కూడా కల్పించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వచ్చి అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు అనేకం ఉన్నాయని తెలిపారు. అద్దెకు ఉంటున్న కుటుంబంలో ఎవరైనా మరణిస్తే, వారి కుటుంబ సభ్యులను మానవతా దృక్పథంతో ఆదరించాలి తప్ప చిన్నచూపు చూసి ఇంటి నుంచి బయటకు పంపకూడదని సూచించారు.

"ఈరోజు అద్దెకు ఉంటున్న వారు.. రేపు మనలో ఒకరు కావచ్చు. ప్రతి మనిషి జీవితంలో ఒకరోజు మరణం తప్పదు. కాబట్టి కష్టకాలంలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం మన సామాజిక బాధ్యత" అని అన్నారు. అద్దెకు ఉంటున్న వారిని పరాయి వారిగా కాకుండా మనలో ఒకరిగా భావించి, వారి కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలవాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.

మానవత్వంతో స్పందించి నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన మున్సిపల్ చైర్మన్ దిలీప్ కుమార్‌పై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కందాల తిరుపతి, కామిశెట్టి జయేందర్, మర్రి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కెమెరా కంటికి ఘన సత్కారం.. జమ్మికుంటలో ఫోటోగ్రఫీ పండుగ!





- రూ.60 వేల నగదు బహుమతులతో ఫోటోగ్రఫీ విజేతలకు ప్రోత్సాహం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** కెమెరా కంటితో ప్రపంచాన్ని అందంగా ఆవిష్కరించే ఫోటోగ్రాఫర్ల ప్రతిభకు జమ్మికుంట వేదికగా నిలిచింది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఫోటో ప్రదర్శనతో పాటు ప్రతిభ కనబరిచిన ఫోటోగ్రాఫర్లకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేయడంతో కార్యక్రమం సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ దిలీప్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపెల్లి రాజేశ్వర్ రావు, జమ్మికుంట ఎస్సై జె. రవి ముఖ్య అతిథులుగా హాజరై ఫోటోగ్రాఫర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను అతిథులు ఆసక్తిగా తిలకించారు. ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధించిన అద్భుత దృశ్యాలు, సాంస్కృతిక వైభవం, వివాహ వేడుకలు, ప్రత్యేక సందర్భాల చిత్రాలను చూసి వారి ప్రతిభను ప్రశంసించారు.

ప్రతిభకు పట్టం.. రూ.60 వేల ప్రోత్సాహక బహుమతులు

ఫోటోగ్రఫీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వెడ్డింగ్, తెలంగాణ సాంస్కృతిక, ప్రీవెడ్డింగ్ విభాగాల్లో ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు, కన్సొలేషన్ బహుమతిగా రూ.వెయ్యి చొప్పున నగదు, జ్ఞాపికలను అందించారు. మొత్తంగా విజేతలకు రూ.60 వేల నగదు బహుమతులను అందజేసి ఫోటోగ్రఫీ కళాకారులను ప్రోత్సహించారు.

కళను గుర్తిస్తే.. మరింత నైపుణ్యం

ఫోటోగ్రఫీ అనేది కేవలం చిత్రాలను బంధించే వృత్తి మాత్రమే కాకుండా ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా మార్చే కళ అని పలువురు పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్ల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడం ద్వారా మరింత నాణ్యమైన ఫోటోగ్రఫీకి దోహదపడుతుందని అన్నారు.

కార్యక్రమంలో జమ్మికుంట మండలానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్లు, జమ్మికుంట ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మడిపల్లి అభివృద్ధికి బాలవికాస బృహత్ ప్రణాళిక

- గ్రామాభివృద్ధే బాలవికాస లక్ష్యం
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరీరెడ్డి



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామంలోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మడిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరీరెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ అవసరాలను గుర్తించేందుకు సూక్ష్మస్థాయి సర్వే నిర్వహించి, సమగ్ర అభివృద్ధి కోసం బాలవికాస ఆధ్వర్యంలో 13 కమిటీలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

బుధవారం జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో ఆదర్శ గ్రామ నిర్మాణం కోసం నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన శౌరీరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. గ్రామంలో అందుబాటులో ఉన్న వనరులు, సమస్యలు, అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజల సహకారంతో మూతపడిన పాఠశాలలను తిరిగి ప్రారంభించి, విద్యార్థుల చదువుకు మార్గం సుగమం చేసినట్లు తెలిపారు. ప్రజల మధ్య సమన్వయం తీసుకురావడం ద్వారా 300 మందికి పైగా విద్యార్థులు విద్యను కొనసాగించేలా బాలవికాస కృషి చేసిందన్నారు.

దేశంలో ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో బాలవికాస కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మడిపల్లిని కూడా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు బాలవికాస ముందుకు వచ్చిందన్నారు. గ్రామ యువత, రైతులు, మేధావులు, పాత్రికేయులు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్థులు సర్పంచ్, పాలకవర్గానికి అండగా నిలిచి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

సర్పంచ్ మ్యాకమల్ల తిరుమలవెంకటేష్ మాట్లాడుతూ.. మడిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు బాలవికాస ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

బాలవికాస ఉమెన్ ప్రోగ్రాం మేనేజర్ లత ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ రూపురేఖలను మార్చేందుకు రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

వితంతు ప్రోగ్రాం, ఆదర్శ గ్రామాల ప్రోగ్రాం మేనేజర్ మంజుల మాట్లాడుతూ.. బాలవికాస ప్రస్థానం, సంస్థ స్థాపకుడు బాలం చేసిన కృషిని వివరించారు. ఒక వ్యక్తిలో పుట్టిన ఆలోచన లక్షలాది మందిలో వెలుగులు నింపిందని అన్నారు.

జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సమావేశంలో బాలవికాస కోఆర్డినేటర్లు జ్యోతి, అమూల్య, సుమలత, స్వాతి, ఆసియా, ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనాథ్, వార్డు సభ్యులు బోనగాని సురేష్, గంగారపు సాయిరాం, మహమ్మద్ హసీనా, పసరకొండ శ్రీనివాస్, మ్యాకమల్ల సాగరిక, మర్రి కళ్యాణి, రామిడి రాజమణి, కస్తూరి శశి వదిన, తాళ్లపల్లి అంజి, చెన్నవేన చంద్రమౌళి, వంగ రాణి, కార్యదర్శి మూగల అంజిరెడ్డి, బాలవికాస విలేజ్ లీడర్లు హసీనా, అంబాల సుమలతతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆటో కార్మికుల గోడు.. ప్రైవేటీకరణ ఆపాలి!



**కాప్రా, ఆగస్టు 19 ( తెలంగాణ ముచ్చట్లు):** ఏళ్ల తరబడి ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలని సామాజిక కార్యకర్త అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాప్రా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికీ తిరిగి చెత్త, ఇతర వ్యర్థాలను సేకరించి నిర్దేశిత ప్రాంతాలకు తరలిస్తూ నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. అయితే సంవత్సరాలుగా సేవలందిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులను పర్మినెంట్ చేయకుండా.. ప్రైవేటీకరణ పేరుతో ఇతర ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. దీనివల్ల కార్మికుల కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో కార్మికుల పొట్ట కొట్టొద్దని, వెంటనే వారి సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత, ఉపాధి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే వారి హక్కుల కోసం మరింత పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# వర్షాలు లేక.. బావుల పూడికతీతతో రైతుల కష్టాలు



- సాగునీటి కోసం రైతుల పాట్లు



**హుజురాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** వానాకాలం సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల కష్టాలు పెరుగుతున్నాయి. పంటల సాగు కోసం ఇప్పటికే అధిక పెట్టుబడులు పెట్టిన రైతులు.. ఇప్పుడు సాగునీటి కోసం అదనపు ఖర్చులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు లేకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు బావులు, బోర్లపై ఆధారపడుతున్నారు.

వ్యవసాయ బావుల్లో పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో రైతులు సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసుకుని బావుల్లో పేరుకుపోయిన మట్టి, పూడికను తొలగిస్తున్నారు. బావుల పూడికతీత, నీటి ప్రవాహ మార్గాల శుభ్రతకు వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు, కూలీల ఖర్చులతో ఇప్పటికే సాగు పెట్టుబడి పెరిగింది. దీనికి తోడు సాగునీటి కోసం పూడికతీత పనులు, మోటార్ల మరమ్మతులు, విద్యుత్ ఖర్చులు అదనంగా భారం అవుతున్నాయి. పంటకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలు సకాలంలో కురిసి చెరువులు, కుంటలు, బావుల్లో నీటి నిల్వలు పెరిగితే సాగునీటి సమస్య కొంతవరకు తగ్గుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం వర్షాల కోసం ఎదురుచూస్తూనే పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేసి రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్టుబడులు పెరుగుతున్నా ప్రకృతి పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. సకాలంలో వర్షాలు కురిసి భూగర్భ జలాలు పెరిగితేనే పంటలను ఆశించిన స్థాయిలో కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తప్పుడు వీడియో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**వేలేరు, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై నిరాధారమైన వీడియోను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు.

వివరాల్లోకి వెళితే, వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రేసు ప్రవీణ్ అనే వ్యక్తి "మల్లికుదుర్ల ప్రజావేదిక" వాట్సాప్ గ్రూపులో ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజకీయ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా, ప్రజలను తప్పుదారి పట్టించే ఉద్దేశంతో వీడియోలను పోస్టు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ విషయమై వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేష్ వెల్లడించారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తప్పుడు సమాచారం ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ఒక్క క్లిక్.. ఎన్నో జ్ఞాపకాలు

- సాంకేతికతతో కొత్త పుంతలు తొక్కుతున్న ఫోటోగ్రఫీ



**హుజూరాబాద్, ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు ):**హుజూరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్ వద్ద ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు స్థానిక ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌తో కలిసి ప్రతినిధులు, సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. సమాజంలో ఫోటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగం కొత్త పుంతలు తొక్కుతోందని తెలిపారు. కాలంతో పాటు చెరిగిపోని జ్ఞాపకాలను పదిలపరచడంతో పాటు సమాజంలోని వాస్తవాలను ప్రపంచానికి చూపించే శక్తి ఒక్క క్లిక్‌కు ఉందని పేర్కొన్నారు.

ఫోటోగ్రఫీ రంగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ ఫోటోగ్రాఫర్ ఐత రాజేందర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులను కూడా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి గౌడ్, ఉపాధ్యక్షుడు యాకుబ్ అలీ, ఎడ్ల కుమారస్వామి, కోశాధికారి మధుకర్, జిల్లా నాయకులు బింగి మురళి, భాషబోయిన రాజేష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామనీ రవీందర్, ఫోటోగ్రాఫర్లు మాడ రవీందర్ రెడ్డి, వోడపల్లి రాజు, రాజేషు, రాజేంద్రప్రసాద్, చక్రపాణి, నరేందర్, బండి రమేష్, బిక్షపతి, అశోక్, సుధాకర్, మోహన్, సృజన్ కుమార్, సొల్లు యాదగిరి తదితరులు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు సమగ్ర కార్యాచరణ

- సురక్షిత ములుగు లక్ష్యంగా నిర్భయ ఫండ్ కమిటీ సమావేశం

**ములుగు, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా నిర్భయ ఫండ్ కమిటీ సమావేశంలో మహిళల భద్రత, సంక్షేమం, సౌకర్యాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. నిర్భయ ఫండ్ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న "మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు" కార్యక్రమం లక్ష్యాలను సమావేశంలో వివరించారు. మహిళలు, బాలికలు సురక్షితంగా జీవించేందుకు, చదువుకునేందుకు, ఉద్యోగాలు చేసేందుకు, స్వేచ్ఛగా ప్రయాణించేందుకు అనుకూలమైన పట్టణ వాతావరణాన్ని సృష్టించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. మహిళలు తరచుగా ఎదుర్కొంటున్న భద్రత, రవాణా, ప్రజా ప్రదేశాల వినియోగం, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, నిర్ణయాధికారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక సంఘాలు, ప్రభుత్వ శాఖలు, పౌరసంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థలు కలిసి పనిచేస్తూ మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆచరణాత్మక పరిష్కారాలను అమలు చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ప్రజా మౌలిక సదుపాయాల మెరుగుదల, భద్రతా వ్యవస్థల బలోపేతం, మహిళలకు అందుబాటు సౌకర్యాల విస్తరణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళల భాగస్వామ్యాన్ని పట్టణ ప్రణాళిక, పాలన వ్యవస్థల్లో పెంచడంతో పాటు వారి నైపుణ్యాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అవసరాలను గుర్తించి ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా రవాణా అధికారి తాకూర్ ఈశ్వర్ సింగ్, ములుగు మున్సిపల్ కమిషనర్ సంపత్, పర్యాటక శాఖ సహాయ మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి, సఖి కేంద్రం అడ్మిన్ లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల గూడు కోసం పోరుబాట

నాలుగో రోజుకు చేరిన నిరాహార దీక్షలు..
ముక్కెర రాజు సంపూర్ణ మద్దతు



**హుజూరాబాద్, ఆగస్టు 19(తెలంగాణ ముచ్చట్లు ):** నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కి నిరసన చేపట్టాల్సి రావడం బాధాకరమని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

హుజూరాబాద్ పట్టణంలో జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యపై హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాలుగో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ముక్కెర రాజు జర్నలిస్టులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు ప్రజల్లో ఉద్యమ ఆకాంక్షను తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తుచేశారు. అలాంటి జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై కోర్టులో ఉన్న కేసుల విషయంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వీడి, బలమైన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనుమతులు, ఇంటి నంబర్లు, విద్యుత్ కనెక్షన్లు పొంది తాత్కాలిక ఇళ్లు నిర్మించుకున్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ముక్కెర రాజు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, జర్నలిస్టులు, జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య, ప్రొఫెసర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర పరిసరాలే వ్యాధుల నివారణకు ఆయుధం

**డెస్క్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** మనిషి ఆరోగ్యంగా జీవించడానికి మంచి ఆహారం, స్వచ్ఛమైన నీరు, వైద్య సదుపాయాలు ఎంత అవసరమో పరిశుభ్రమైన పరిసరాలు కూడా అంతే అవసరం. ఆధునిక వైద్య రంగం ఎన్నో అద్భుత విజయాలు సాధించినప్పటికీ, అనేక వ్యాధుల మూల కారణాలు ఇప్పటికీ అపరిశుభ్రతతోనే ముడిపడి ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థలు పదేపదే చెబుతున్నట్లుగా, నివారణ చికిత్స కంటే ఉత్తమం. ఆ నివారణలో మొదటి మెట్టు పరిశుభ్రత. ఇంటి నుంచి వీధి వరకు, గ్రామం నుంచి నగరం వరకు పరిశుభ్రతను అలవాటు చేసుకుంటే అనేక వ్యాధులను ముందుగానే అరికట్టవచ్చు. వర్షాకాలం వచ్చిందంటే దోమల బెడద, నీటి కలుషితం, అంటువ్యాధుల వ్యాప్తి వంటి సమస్యలు పెరుగుతాయి. ఇళ్ల చుట్టూ నిల్వ నీరు ఉండటం, కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతాయి. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రధానంగా ఇలాంటి పరిస్థితుల్లోనే వ్యాపిస్తాయి. ప్రతి ఏడాది ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వ్యాధి నియంత్రణ చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రజలు పరిశుభ్రత పాటించకపోతే ఆశించిన ఫలితాలు సాధ్యం కావు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి పాత్ర అత్యంత కీలకం.



పరిశుభ్రత అనేది కేవలం వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, అది సామాజిక బాధ్యత కూడా. మన ఇంటిని శుభ్రంగా ఉంచడంతో పని పూర్తికాదు. మన వీధి, కాలనీ, గ్రామం కూడా పరిశుభ్రంగా ఉండేలా అందరూ కలిసి కృషి చేయాలి. రోడ్లపై చెత్త వేయడం, కాలువల్లో వ్యర్థాలను పడేయడం, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండేలా చేయడం వంటి అలవాట్లు సమాజ ఆరోగ్యానికే ముప్పుగా మారుతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం వల్ల మొత్తం ప్రాంతం వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకే పరిశుభ్రతను వ్యక్తిగత అంశంగా కాకుండా సామూహిక కర్తవ్యంగా చూడాలి. దేశంలో పారిశుద్ధ్యంపై అవగాహన పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, గ్రామీణ పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అయినప్పటికీ కేవలం ప్రభుత్వ చర్యలతోనే లక్ష్యాలు సాధ్యం కావు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ పరిశుభ్రత కార్యక్రమమూ విజయవంతం కాదు. స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు కూడా ఈ దిశగా చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.

నేటి కాలంలో జీవనశైలి మార్పులతో కొత్త ఆరోగ్య సమస్యలు వస్తున్నప్పటికీ, పాత అంటువ్యాధులు ఇంకా పూర్తిగా అంతరించిపోలేదు. కలుషిత నీటి వల్ల వచ్చే విరేచనాలు, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి వ్యాధులు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, వ్యర్థాల సరైన నిర్వహణ ఉంటే ఈ వ్యాధుల్లో చాలా వరకు నివారించవచ్చు. ప్రజారోగ్య వ్యవస్థపై భారం తగ్గించడంలో కూడా పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుంది. వ్యాధులు రాకుండా చూడడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. పిల్లల్లో పరిశుభ్రత అలవాట్లను చిన్నప్పటి నుంచే పెంపొందించాల్సిన అవసరం ఉంది. చేతులు కడుక్కోవడం, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి విషయాలను విద్యా వ్యవస్థలో భాగం చేయాలి. పరిశుభ్రతపై అవగాహన కలిగిన తరం పెరిగితే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి ఈ బాధ్యతను నిర్వర్తించాలి.

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పరిశుభ్రత సవాళ్లు కూడా పెరుగుతున్నాయి. జనాభా పెరుగుదల, వ్యర్థాల ఉత్పత్తి అధికం కావడం, మురుగు నీటి నిర్వహణలో లోపాలు వంటి కారణాలతో అనేక నగరాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం, పునర్వినియోగ విధానాలను ప్రోత్సహించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు చేపట్టాలి. పరిశుభ్రమైన నగరాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అవుతాయి. పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజారోగ్యం పరస్పరం అనుసంధానమైన అంశాలు. చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం, ప్లాస్టిక్ కాలుష్యం, నీటి వనరుల కలుషితం వంటి సమస్యలు ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల పరిశుభ్రతను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంగా కూడా చూడాలి. స్వచ్ఛమైన పరిసరాలు ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.

సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, వ్యాధుల నివారణకు అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన మార్గం పరిశుభ్రతే. ఒక ప్రాంతంలో ఆసుపత్రులు పెరగడం కంటే అక్కడ వ్యాధులు తగ్గడం గొప్ప విషయం. వైద్య చికిత్స అవసరం లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండే పరిస్థితులను సృష్టించడమే నిజమైన అభివృద్ధి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలి. ప్రపంచ దోమల దినోత్సవం వంటి సందర్భాలు మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని గుర్తు చేస్తున్నాయి. వ్యాధులతో పోరాడే అత్యంత శక్తివంతమైన ఆయుధం మందులు మాత్రమే కావు; పరిశుభ్రమైన పరిసరాలూ అంతే ప్రభావవంతమైనవి. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేసినప్పుడే వ్యాధులపై విజయం సాధించగలం. పరిశుభ్రతను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా నిత్యజీవిత సంస్కృతిగా మార్చగలిగితే ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణం సాధ్యమవుతుంది.

# అక్షయ ఇంధనమే భవిష్యత్ అభివృద్ధి బాట

- పునరుత్పాదక శక్తి వినియోగంపై అవగాహన
- సౌర, పవన విద్యుత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
- కాలుష్య నియంత్రణలో అక్షయ ఇంధనాల పాత్ర

**డెస్క్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం ఆగస్టు 20న భారత అక్షయ్ ఊర్జా దివస్‌ను నిర్వహిస్తారు. దేశంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వాటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినం ప్రధాన ఉద్దేశం. సౌరశక్తి, పవనశక్తి, జలవిద్యుత్, బయోమాస్ వంటి స్వచ్ఛమైన ఇంధన వనరులను విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల ద్వారా తెలియజేస్తారు. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అక్షయ ఇంధనాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వినియోగం కారణంగా పర్యావరణంపై తీవ్రమైన ప్రభావాలు కనిపిస్తున్నాయి. బొగ్గు, పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల దహనం వల్ల వాతావరణంలో కార్బన్ ఉద్గారాలు పెరిగి భూతాపం వేగవంతమవుతోంది. వాతావరణ మార్పులు, తీవ్ర ఉష్ణోగ్రతలు, అసాధారణ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో స్వచ్ఛమైన శక్తి వనరుల అవసరం మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో అక్షయ ఇంధనాలు ప్రపంచానికి ఆశాకిరణంగా మారాయి.

సౌరశక్తి ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన రంగంగా గుర్తింపు పొందింది. భారతదేశంలో సంవత్సరంలో ఎక్కువ రోజులు సూర్యరశ్మి అందుబాటులో ఉండటంతో సౌర విద్యుత్ ఉత్పత్తికి అపార అవకాశాలు ఉన్నాయి. ఇళ్లపై ఏర్పాటు చేసే సౌర పలకల నుంచి భారీ సౌర విద్యుత్ కేంద్రాల వరకు అనేక ప్రాజెక్టులు అమలవుతున్నాయి. విద్యుత్ ఖర్చులను తగ్గించడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించకుండా విద్యుత్ ఉత్పత్తి చేయగలగడం సౌరశక్తి ప్రత్యేకత. పవనశక్తి కూడా దేశ ఇంధన భద్రతలో కీలక పాత్ర పోషిస్తోంది. గాలి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పవన విద్యుత్ కేంద్రాలు భారీ స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంత రాష్ట్రాలు పవనశక్తి ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాయి. ఒకసారి మౌలిక వసతులు ఏర్పాటు చేసిన తర్వాత తక్కువ నిర్వహణ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేయగలగడం పవనశక్తి ప్రధాన ప్రయోజనం.

భారతదేశం పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచంలోని అగ్రదేశాల్లో ఒకటిగా ఎదుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అక్షయ ఇంధన రంగానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. సౌర విద్యుత్ పార్కులు, పైకప్పు సౌర వ్యవస్థలు, గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమాలు, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం వంటి చర్యలు చేపడుతోంది. దీంతో దేశంలో స్వచ్ఛ శక్తి ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరుగుతోంది. అక్షయ ఇంధనాల వినియోగం ఆర్థిక రంగానికి కూడా ప్రయోజనకరంగా మారుతోంది. శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా విదేశీ మారక నిల్వలను ఆదా చేయవచ్చు. అదే సమయంలో కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడుతున్నాయి. సౌర పరికరాల తయారీ, స్థాపన, నిర్వహణ, పరిశోధన వంటి రంగాల్లో లక్షలాది మందికి ఉపాధి లభిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కూడా అక్షయ ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. విద్యుత్ సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో సౌరశక్తి ఆధారిత వ్యవస్థలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయి. సౌర దీపాలు, నీటి పంపులు, చిన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రైతులకు, గ్రామీణ కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోంది. అయితే అక్షయ ఇంధన రంగం ముందున్న సవాళ్లు కూడా కొంతమేర ఉన్నాయి. ప్రారంభ పెట్టుబడులు ఎక్కువగా ఉండటం, నిల్వ సాంకేతికతల అభివృద్ధి అవసరం, విద్యుత్ పంపిణీ వ్యవస్థల ఆధునికీకరణ వంటి అంశాలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. అయినప్పటికీ సాంకేతిక పురోగతితో ఈ సమస్యలకు క్రమంగా పరిష్కారాలు లభిస్తున్నాయి. ప్రభుత్వాలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.



భారత అక్షయ్ ఊర్జా దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు పునరుత్పాదక ఇంధనాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరిస్తాయి. శక్తి పొదుపు, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ శక్తి వినియోగంపై చర్చలు, ప్రదర్శనలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. యువతలో శక్తి సంరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన పర్యావరణాన్ని అందించాలంటే అక్షయ ఇంధనాల వినియోగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. సౌరశక్తి, పవనశక్తి వంటి వనరులు కేవలం విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు, ఇంధన స్వావలంబనకు కూడా కీలక ఆధారాలుగా మారుతున్నాయి. భారత అక్షయ్ ఊర్జా దివస్ ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రేమ బంధంపై అనుపమ వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. గతంలో ఓ వ్యక్తితో రెండేళ్లపాటు ప్రేమలో ఉన్నానని, ఆ సమయంలో తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నానని తెలిపారు. ఆ బంధం తనను తీవ్రంగా కుంగదీసిందని, దాని నుంచి బయటపడేందుకు చాలా కష్టపడ్డానని ఆమె పేర్కొన్నారు.

పీరియడ్స్ సమయంలోనూ హేళన

స్త్రీలకు సహజంగా జరిగే రుతుక్రమం సమయంలో కూడా తనను ఆ వ్యక్తి చులకనగా చూసేవాడని అనుపమ తెలిపారు. తనను ప్రశ్నించిన ప్రతిసారీ.. రుతుక్రమం కారణంగానే తాను అలా మాట్లాడుతున్నానంటూ హేళన చేసేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మాటలు తనపై తీవ్ర ప్రభావం చూపించాయని, ఒక దశలో తనపై తనకే అసహ్యం కలిగే స్థాయికి వెళ్లిపోయానని చెప్పారు.

సినీ రంగంలో ఎంతో ధైర్యంగా కనిపించే తాను ఆ సమయంలో తీవ్ర మానసిక కుంగుబాటుకు లోనయ్యానని అనుపమ వివరించారు. ఆ బంధం తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందని పేర్కొన్నారు.

పిల్లలు వద్దనే నిర్ణయం

ఆ చేదు అనుభవాలు తన జీవితంపై, భవిష్యత్తుపై ఉన్న ఆలోచనలను పూర్తిగా మార్చేశాయని అనుపమ తెలిపారు. చిన్నతనంలో భవిష్యత్తులో ఎక్కువ మంది పిల్లలు ఉండాలని కోరుకునేదానినని, అయితే ఆ బంధంలో ఎదురైన అనుభవాల తర్వాత తన ఆలోచనలు పూర్తిగా మారిపోయాయని చెప్పారు.

ఇక తన జీవితంలో పిల్లలు వద్దనే నిర్ణయానికి వచ్చినట్లు అనుపమ వెల్లడించారు. ఆ సమయంలో ఎదుర్కొన్న మానసిక వేదన తనపై అంతటి ప్రభావం చూపిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

చేదు జ్ఞాపకాలను అధిగమించి..

గతంలో ఎదురైన మానసిక క్షోభ నుంచి ఇప్పుడు పూర్తిగా బయటపడ్డానని అనుపమ తెలిపారు. ఆ చేదు జ్ఞాపకాలను వెనక్కి నెట్టి ప్రస్తుతం తన సినీ కెరీర్‌పై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. అనుపమ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో అభిమానులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.

## అభిమాన యువతికి రామ్ పోతినేని అండ





**హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ సినీ నటుడు రామ్ పోతినేని తన అభిమాని పట్ల గొప్ప మనసు చాటుకున్నారు. అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న ఓ యువతికి అండగా నిలిచారు. ఆమెతో నేరుగా దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పడమే కాకుండా, వైద్యానికి అయ్యే ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన సాలాడి శ్రీను, శ్రీదుర్గ దంపతుల కుమార్తె శశిభవ్యత ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబంలో మూడు తరాలుగా కొనసాగిన మేనరిక వివాహాల కారణంగా ఆమె అరుదైన జన్యుపరమైన వ్యాధికి గురైనట్లు వైద్యులు గుర్తించారు. తరచూ మూర్ఛ రావడం, నరాలకు సంబంధించిన సమస్యలు తలెత్తడంతో ఆమె మంచానికే పరిమితమైంది.

శశిభవ్యత మానసిక పరిస్థితి స్థిరంగా లేకపోయినా తన అభిమాన నటుడు రామ్ పేరు వినగానే ఉత్సాహంగా స్పందిస్తుందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఆమెకు భోజనం పెట్టే సమయంలో, మందులు వేసే సమయంలో రామ్ నటించిన సినిమాలు, వీడియోలు చూపిస్తుంటామని చెప్పారు.

ఈ హృదయవిదారక విషయం మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా రామ్ దృష్టికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వెంటనే ఆయన స్పందించారు.

వైద్య ఖర్చులు తానే భరిస్తానని హామీ

బుధవారం శశిభవ్యతతో రామ్ దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. ఆమె తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. శశిభవ్యతకు సంబంధించిన వైద్య నివేదికలు తనకు అందాయని, ఇకపై ఆమె మందులు, ఇతర వైద్య అవసరాలకు అయ్యే ఖర్చులన్నింటినీ తానే చూసుకుంటానని భరోసా ఇచ్చారు.



## ఈడీ విచారణకు నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. నిషేధిత, అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన కేసులో భాగంగా అధికారులు ఆమెను సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు పోలీసుల భద్రత మధ్య ఆమె విచారణకు చేరుకున్నారు.

బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై ఆరా

జీత్ విన్ సహా పలు ఆన్‌లైన్ బెట్టింగ్ వేదికలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసిన వ్యవహారంలో నిధి అగర్వాల్ పాత్రపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అక్రమ ఆర్థిక లావాదేవీలు, హవాలా మార్గాల ద్వారా నగదు బదిలీ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. యాప్‌ల ప్రచారానికి సంబంధించిన ఒప్పందాలు, అందుకున్న పారితోషికం, బ్యాంకు ఖాతాల్లో జరిగిన లావాదేవీలు, డిజిటల్ ఆధారాలపై ఈడీ అధికారులు ప్రధానంగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో నిధి అగర్వాల్ ఇప్పటికే తెలంగాణ నేర పరిశోధన విభాగం అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే అనర్థాల గురించి పూర్తిగా తెలియకుండానే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు ఆమె గతంలో వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ ప్రచారాల ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలపై స్పష్టత కోసం ఈడీ అధికారులు ప్రస్తుతం ఆమెను ప్రశ్నిస్తున్నారు. విచారణలో ఆమె నుంచి అధికారిక వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన ఈ కేసులో నిధి అగర్వాల్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులను కూడా అధికారులు విచారిస్తున్నారు. సైబరాబాద్ పోలీసుల నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి తదితరులు ఈ కేసుకు సంబంధించి విచారణను ఎదుర్కొన్నట్లు సమాచారం. ప్రస్తుతం నిధి అగర్వాల్ విచారణపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# హైదరాబాద్‌లో చార్ల్స్ ష్వాబ్ కార్యాలయ ప్రారంభం

- **గ్లోబల్ సామర్థ్య కేంద్రానికి శ్రీకారం**
- **తెలంగాణ సాంకేతిక సామర్థ్యాలకు గుర్తింపు**
- **యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు**
- **సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం సహకారం**
- **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ చార్ల్స్ ష్వాబ్ సర్వీసెస్ ఇండియా హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యాలయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం తెలంగాణలో ఉన్న ప్రతిభ, సాంకేతిక సామర్థ్యాలు, బలమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థకు నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణను తమ విస్తరణకు కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర అభివృద్ధికి శుభపరిణామమని అన్నారు.

ఈ కేంద్రం ద్వారా సంస్థకు సంబంధించిన సాంకేతిక సేవలు, నిర్వహణ కార్యకలాపాలు, వ్యాపార సేవలకు మద్దతు అందించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి కార్యకలాపాలను హైదరాబాద్ నుంచి నిర్వహించడం ద్వారా నగర ప్రాధాన్యం మరింత పెరుగుతుందని చెప్పారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు, విస్తరించేందుకు అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి వెల్లడించారు. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

చార్ల్స్ ష్వాబ్ సంస్థ రాకతో సాంకేతిక, ఆర్థిక సేవల రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం కలిగిన యువతకు ప్రపంచ స్థాయి సంస్థల్లో పనిచేసే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని సాంకేతిక రంగ అభివృద్ధికి ఈ సంస్థ తోడ్పాటునందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన చార్ల్స్ ష్వాబ్ సర్వీసెస్ ఇండియా సంస్థకు మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో సంస్థ మరింత విస్తరించి హైదరాబాద్ అంతర్జాతీయ వ్యాపార సమాజంలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు.



# దుద్దెనపల్లిలో పల్లె దవాఖాన ప్రారంభం

- **పొన్నం ప్రభాకర్ ప్రజా పాలన కార్యక్రమం**
- **గ్రామ సమస్యల పరిష్కారంపై దృష్టి**
- **రైతులు, మహిళలతో ప్రత్యక్ష భేటీ**
- **వినతులకు అక్కడికక్కడే స్పందన**

**హుస్నాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖాన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామస్థులు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అనంతరం గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత, గ్రామ పెద్దలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి, తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు అందాయి. వాటిని స్వీకరించిన మంత్రి సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాధ్యమైన అంశాలపై వెంటనే నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ప్రజా పాలన ప్రత్యేకత అని పేర్కొన్నారు.

రైతుల సమస్యలపై కూడా మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. సాగునీరు, పంటల సాగు, మార్కెటింగ్, రైతు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై రైతులతో చర్చించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, ఆరోగ్యం, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్ర అభివృద్ధిని సాధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేబీఆర్ వన్‌వేతో ట్రాఫిక్ తిప్పలు

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు.

ట్రాఫిక్ నియంత్రణ కోసం కేబీఆర్ పార్క్ చుట్టూ కొత్త వన్‌వే విధానాన్ని అధికారులు అమలు చేశారు. అయితే కొత్త మార్గాలపై పూర్తి అవగాహన లేకపోవడం, ప్రత్యామ్నాయ రహదారులపై వాహనాల ఒత్తిడి పెరగడం వల్ల అనేక కూడళ్ల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. ముఖ్యంగా రోడ్ నంబర్ 10, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, బంజారాహిల్స్ ప్రధాన మార్గాల్లో రద్దీ తీవ్రంగా కనిపించింది. సాధారణంగా 10 నుంచి 15 నిమిషాల్లో పూర్తయ్యే ప్రయాణానికి 40 నుంచి 45 నిమిషాల వరకు సమయం పట్టినట్లు ప్రయాణికులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వాహనాల సగటు వేగం గణనీయంగా తగ్గిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

అయితే ఇది ప్రారంభ దశలో ఎదురయ్యే సాధారణ సమస్య మాత్రమేనని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కొత్త విధానానికి ప్రజలు అలవాటు పడిన తర్వాత ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపడుతుందని, రద్దీ తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్పులు చేపడతామని వెల్లడించారు. ప్రస్తుతం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించాలని ట్రాఫిక్ శాఖ సూచించింది. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణలో కొత్త విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆక్రమిత భూములపై మంత్రి ఆదేశాలు

- **ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణకు ఆదేశం**
- **పల్లెగూడెం అభివృద్ధికి రూ.61.76 కోట్లు**
- **అర్హులందరికీ ఇళ్ల స్థలాల హామీ**
- **కొత్త అంగన్‌వాడీ భవనానికి మంజూరు**

**ఖమ్మం రూరల్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హ కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూములను సమీకరించి పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పల్లెగూడెం సమగ్ర అభివృద్ధి కోసం మొత్తం రూ.61.76 కోట్లతో పలు పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. కేవలం రెండు నెలల వ్యవధిలో రూ.20 లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని నాణ్యతతో పూర్తి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో కొత్త అంగన్‌వాడీ భవన నిర్మాణానికి తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఈ నెల 31వ తేదీలోగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ

- **పొంగులేటి చేతుల మీదుగా పంపిణీ**
- **12 మంది లబ్ధిదారులకు మంజూరు**
- **నూరుశాతం సబ్సిడీతో అందజేత**
- **సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు**

**ఖమ్మం, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):**



దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన 12 మంది దివ్యాంగ లబ్ధిదారులకు నూరుశాతం సబ్సిడీపై త్రిచక్ర మోటారు వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన మంత్రి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తోందని తెలిపారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తోందని మంత్రి అన్నారు. వారి రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా త్రిచక్ర మోటారు వాహనాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ వాహనాలు దివ్యాంగుల దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు స్వయం ఆధారిత జీవనానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమాజంలో దివ్యాంగుల పట్ల సానుకూల దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతిభ, పట్టుదల ఉంటే దివ్యాంగులు కూడా అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు, సహాయక పరికరాల అందుబాటుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వివరించారు.

త్రిచక్ర వాహనాల పంపిణీ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల్లో కొత్త ఉత్సాహం నెలకొందని అధికారులు తెలిపారు. ఈ వాహనాల ద్వారా విద్య, ఉపాధి, వ్యాపార కార్యకలాపాలకు వెళ్లడం సులభమవుతుందని పేర్కొన్నారు. దివ్యాంగుల స్వావలంబనకు ఇలాంటి కార్యక్రమాలు కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని అధికారులు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సిలుకు సిలుకు సీరాలు

## ప్రోమో విడుదల చేసిన పిడమర్తి రవి

- జానపద కళలకు ప్రోత్సాహం అందించాలి
- తెలంగాణ ఉద్యమకారుడు,ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):



జానపద సొగసులతో రూపొందుతున్న 'సిలుకు సిలుకు సీరాలు నాకే తెస్తానంటాడు నా మొగుడే' పాట ప్రోమోను తెలంగాణ ఉద్యమకారుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి విడుదల చేశారు. ప్రోమోను వీక్షించిన అనంతరం పాట బృందాన్ని అభినందించారు. జానపద కళలు, గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేలా పాటను రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ.. జానపద గీతాలు మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయని అన్నారు. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ ఇలాంటి పాటలను రూపొందించడం అభినందనీయమని తెలిపారు. 'సిలుకు సిలుకు సీరాలు' ప్రోమో ఆకట్టుకునేలా ఉందని, పాటకు మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. యూట్యూబ్‌లో పాటకు మరింత ఆదరణ లభించేలా ప్రతి ఒక్కరూ ప్రోమోను వీక్షించి, బృందాన్ని ప్రోత్సహించాలని కోరారు. పాట బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్,ఉపాధ్యక్షులు బొల్లెపాక రాజేష్,బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్,ఉప్పల్ ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ గ్యారంపల్లి శివాజీ,సింగం,జానీ,ప్రకాష్,నాని మైలారం,ప్రొడ్యూసర్ ఆర్పిఏ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ సంస్కరణలపై సుప్రీం దృష్టి

- ఎన్‌టీఏకు పూర్తి వివరాల సమర్పణ ఆదేశం
- వ్యవస్థాగత మార్పులు శాశ్వతంగా అమలు కావాలన్న ధర్మాసనం
- ప్రశ్నపత్రాల భద్రతపై కేంద్రం వివరణ
- పేపర్ లీక్‌ల పునరావృతంపై ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):



నీట్ పరీక్షల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షల విధానంలో సంస్కరణలు కేవలం నివేదికలు, సిఫార్సులకే పరిమితం కాకుండా శాశ్వత వ్యవస్థగా అమలు కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నీలేకని కమిటీలు సూచించిన సంస్కరణల అమలుపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల పూర్తి వివరాలను సమర్పించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను ఆదేశించింది. నీట్‌యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరఫున దాఖలైన పిటిషన్‌ను కూడా కోర్టు పరిశీలించింది. పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగత మార్పులు అవసరమని, ఒకసారి సంస్కరణలు ప్రకటించడం సరిపోదని, వాటి అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ధర్మాసనం పేర్కొంది.
విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నీట్ ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల చేతికి చేరే వరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ అమల్లో ఉందని ఆయన కోర్టుకు వివరించారు. ప్రశ్నపత్రం రూపకల్పనలో అనేక స్థాయిల్లో గోప్యత పాటిస్తున్నామని, ప్రశ్నల ఎంపిక ప్రక్రియను అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణాలో కూడా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రశ్నపత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చినట్లు, వాహనం కదలికలన్నీ నిరంతరం పర్యవేక్షణలో ఉంటాయని కోర్టుకు తెలియజేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భద్రతా వ్యవస్థను ఛేదించడం చాలా కష్టమని కేంద్రం పేర్కొంది.
నీట్ పేపర్ లీక్ ఘటనల అనంతరం కేంద్ర విద్యాశాఖ ఏడుగురు సభ్యులతో రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల నిర్వహణ, డేటా భద్రత, ఎన్‌టీఏ నిర్మాణం, విధి నిర్వహణలో సంస్కరణలపై ఈ కమిటీ పలు కీలక సిఫార్సులు చేసింది. అదే సమయంలో మరింత విస్తృత స్థాయి మార్పుల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో మరో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. విచారణ అనంతరం పిటిషనర్ల తరఫు న్యాయవాది తన్వీ దూబే స్పందిస్తూ, రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులు ఉన్నప్పటికీ గతంలో చోటుచేసుకున్న లోపాలు ఎందుకు పునరావృతమయ్యాయనే అంశంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు నొక్కిచెప్పిందని తెలిపారు.

# పరకాల టికెట్‌పై కాంగ్రెస్‌లో కలకలం

- సీఎం వ్యాఖ్యలపై సుష్మిత అభ్యంతరం
- కొండా మురళికి అన్యాయం జరుగుతోందన్న ఆరోపణ
- అధిష్ఠానమే అభ్యర్థులను నిర్ణయిస్తుందన్న వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ అంశం మరోసారి రాజకీయ చర్చకు దారి తీసింది. ఇటీవల జరిగిన కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిత్వంపై ప్రకటనలు చేయడం సరికాదని ఆమె వ్యాఖ్యానించారు. పరకాల నియోజకవర్గంలో మరోసారి రేవూరి ప్రకాశ్‌రెడ్డికే టికెట్ ఇస్తామని ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారని సుష్మిత ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సంప్రదాయాల ప్రకారం అభ్యర్థుల ఎంపిక అధిష్ఠానం పరిధిలో ఉంటుందని, వ్యక్తిగతంగా ఎవరూ నిర్ణయాలు ప్రకటించలేరని అన్నారు. స్థానిక స్థాయిలో ప్రజల అభిప్రాయాలు, పార్టీ పరిస్థితులు, నాయకుల పనితీరును పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. తన తండ్రి కొండా మురళిని పార్టీ నాయకత్వం పక్కన పెడుతోందని సుష్మిత ఆరోపించారు. కొండా మురళి సాధారణ రాజకీయ నాయకుడు కాదని, అనేక రాజకీయ పరిణామాలకు కీలక పాత్ర పోషించిన నాయకుడని చెప్పారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో మొదటగా మద్దతు తెలిపింది కొండా దంపతులేనని గుర్తు చేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత కూడా తమ కుటుంబానికి తగిన గుర్తింపు లభించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని పార్టీ నాయకత్వం హామీ ఇచ్చిందని సుష్మిత పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. సంగారెడ్డి వంటి నియోజకవర్గాల విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పే నాయకత్వం, పరకాల విషయంలో మాత్రం ముందస్తు ప్రకటనలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనిపై పార్టీ స్పష్టత ఇవ్వాలని కోరారు.
యువతకు అవకాశాలు కల్పించాలని మాట్లాడే నాయకులు, ఇప్పటికే పదవిలో ఉన్న నాయకులకే మళ్లీ టికెట్లు ఇస్తామని ప్రకటించడం విరుద్ధ ధోరణి అని ఆమె వ్యాఖ్యానించారు. బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కూడా ఆరోపించారు. రాజకీయ నాయకత్వంలో సమతుల్యత, నిబద్ధత అవసరమని పేర్కొంటూ పలు అంశాలపై సీఎం తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత విమర్శలు గుప్పించారు. రాష్ట్ర రాజకీయాల్లో కొందరు నాయకులు అధిక ప్రభావం చూపుతున్నారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. పరకాల టికెట్ వ్యవహారం రానున్న రోజుల్లో మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# రాష్ట్రంలో రహదారి మౌలిక వసతులకు భారీ ఊతం

- పెద్దపల్లిలో రూ.219.67 కోట్ల పనులకు శంకుస్థాపన
- ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న కోమటిరెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రహదారి పనులు
- హైదరాబాద్–రామగుండం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై కసరత్తు

పెద్దపల్లి, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మెరుగైన రహదారులు పారిశ్రామిక, వ్యాపార కార్యకలాపాలకు ఊతమివ్వడంతో పాటు స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గారేపల్లిలో బుధవారం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) మరియు ఇతర రహదారి అభివృద్ధి పనులకు రూ.219.67 కోట్లతో శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రహదారి రంగం కీలక పాత్ర పోషిస్తోందని, అందుకే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వివరించారు.
రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.13 వేల కోట్ల విలువైన రహదారి పనులు చేపడుతుండగా, పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో రూ.17 వేల కోట్ల పనులు కొనసాగుతున్నాయని కోమటిరెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత భారీ స్థాయిలో రహదారి పనులు చేపట్టడం లేదని ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఏఎం విధానంలో ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం కాంట్రాక్టర్ భరిస్తారని వివరించారు. గారేపల్లిలో ప్రారంభించిన రహదారి పనులు రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. వారం రోజుల్లోనే భౌతిక పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. రహదారులు మెరుగుపడటంతో ప్రయాణ సౌకర్యాలు పెరగడమే కాకుండా ప్రమాదాలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. అయితే వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.
గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కోమటిరెడ్డి, సుమారు రూ.40 వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచి వెళ్లిందని ఆరోపించారు. అలాగే హైదరాబాద్-రామగుండం మధ్య కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదిత రహదారిలో భాగంగా సుల్తానాబాద్ బైపాస్‌కు కూడా ఆమోదం పొందేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జలవనరుల అంశాన్ని ప్రస్తావిస్తూ, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఆరోపించారు. ప్రస్తుతం శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి మళ్లీ నీటి పంపింగ్ ప్రారంభించి రైతులకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ప్రజాప్రతినిధుల కృషిని అభినందించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిందని వెల్లడించారు.

# ప్రిన్సిపల్ హత్య కేసు ఛేదన

- ఇద్దరు మైనర్ విద్యార్థులే నిందితులు
- డబ్బు కోసం దారుణ హత్యకు పాల్పడినట్లు వెల్లడి
- 70 సీసీ కెమెరాల ఆధారంగా మిస్టరీ వీడింది

నల్గొండ, ఆగస్టు 19 (తెలంగాణ ముచ్చట్లు):

నల్గొండ జిల్లాలో సంచలనం రేపిన నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘాతుకానికి ఇద్దరు మైనర్ విద్యార్థులే పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడిన ఈ ఇద్దరు విద్యార్థులు డబ్బు కోసం చోరీకి ప్రయత్నించి, పరిస్థితులు అనుకూలించకపోవడంతో హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న కొండమల్లేపల్లిలోని రూపారెడ్డి నివాసంలో చోరీ చేయాలనే ఉద్దేశంతో ఇద్దరు విద్యార్థులు ముందస్తుగా పథకం రచించినట్లు తెలిపారు. వారిలో ఒకరు ముఖానికి మాస్క్ ధరించి ఇంటి గోడ దూకి లోపలికి ప్రవేశించాడని చెప్పారు. అయితే మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందన్నారు.
తాను పట్టుబడతాననే భయంతో నిందితుడు వెంట తెచ్చుకున్న కత్తితో రూపారెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్పీ వివరించారు. ఆమెపై ఏకంగా 27 సార్లు కత్తిపోట్లు పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేశాడని తెలిపారు. అనంతరం ఇంట్లో ఉన్న నగదు తీసుకోవడంతో పాటు ఆమె సెల్‌ఫోన్‌ను కూడా తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు వెల్లడించారు. కేసు ఛేదన కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృత దర్యాప్తు చేపట్టారు. సంఘటన ప్రాంతం పరిసరాల్లోని సుమారు 70 సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత ఇద్దరు విద్యార్థులు అనుమానాస్పదంగా గైర్హాజరవడంతో పాటు అకస్మాత్తుగా అధికంగా డబ్బు ఖర్చు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వారిపై దృష్టి సారించారు. అనంతరం అదుపులోకి




తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.
దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చిందని పోలీసులు పేర్కొన్నారు. గతంలో హాస్టల్‌లో ఉండగా నిందితుడి వద్ద నగదు, సెల్‌ఫోన్ లభించడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి అతడిని మందలించారని తెలిపారు. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్న విద్యార్థి, డబ్బు అవసరం కూడా ఉండటంతో ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. హత్య వెనుక వ్యక్తిగత కక్షతో పాటు ఆర్థిక ప్రయోజనం కూడా ప్రధాన కారణాలుగా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుల వద్ద నుంచి రూ.1.54 లక్షల నగదు, ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న కరెన్సీ నోట్లపై ఉన్న రక్తపు మరకలను శాస్త్రీయ పరీక్షలకు పంపగా అవి మనిషి రక్తమేనని నిర్ధారణ అయినట్లు తెలిపారు. నిందితులు మైనర్లు కావడంతో వారిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరచనున్నట్లు చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో కీలక






పాత్ర పోషించిన పోలీసు బృందాలను ఎస్పీ అభినందించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in